17వ
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం,28 జనవరి 2024

'కులగణనా లేక రాజకీయ రోదనా' గోడపత్రిక ఆవిష్కరణ

కాకినాడ, మేజర్ న్యూస్ : జనసేన అధినాయకులు పవన్ కళ్యాణ్ ఈ రాష్ట్ర ప్రభుత్వ కులగణన పేరుతో కార్యక్రమాన్ని ప్రశ్నిస్తూ ఇచ్చిన పిలుపుని పురస్కరించుకుని శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో కాకినాడ సిటీ ఇంచార్జ్ మరియు పి.ఏ.సి సభ్యులు ముత్తా శశిధర్ కులగణనా లేక రాజకీయ రోదనా అంటూ గోడపత్రికని విడుదల చేసారు. ఈ సందర్భంగా ముత్తా శశిధర్ మాట్లాడుతూ తమ నాయకులు పవన్ కళ్యాణ్ సంధించిన ప్రశ్నలకు ఈ కాబోయే మాజీ ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ఇన్నాళ్ళూ గుర్తుకురాని ప్రజాసంక్షేమం కొత్తది ఏదో ఇప్పుడు గుర్తుకువచ్చినట్టు హడావిడిగా వాలంటీర్లను ప్రజలమీదకి ఎగదోసి కులగణన పేరు చెప్పి వారి వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారనీ, అంటే వాలంటీర్ వ్యవస్థని ప్రవేశపెట్టి ఇన్నాళ్ళూ వారితో ఇన్ని కుటుంబాలకు ఒక వాలంటీర్ జవాబుదారీ అని పనిచేయిస్తున్నామని చెప్పినది అంతా బూటకమా ఇదే నిజమైతే వారితో ఇన్నాళ్ళు ఏఏ పనులు చేపించారో చెప్పాలని ప్రశ్నించారు. ఎన్నికల ముందు కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్ది పొందడానికి ఈ అని అనుమానాలు ప్రజలు వ్యక్తం చేస్తున్నారన్నారు. అసలు ఇలా సేకరించిన వ్యక్తిగత డేటాను ఎవరివద్ద భద్రపరుస్తున్నారో అని భయాందోళనలు వ్యక్తం చేసారు. సుప్రీంకోర్టులో ఈ కులగణన మీద కేసు ఒకటి నడుస్తుండగా ఆగమేఘాలమీద ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాన్ని న్యాయవ్యవస్థ సమీక్షించాలని డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో సిటీ ఉపాధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణ మరియు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లంచావతారిణి కార్యదర్శి వేలల్లో ఫార్మాలిటీస్



అవినీతిలో కూరుకుపోతున్న వలసపాకల పంచాయితీ

- నేరుగా లంచం తీసుకుంటూ కెమెరాకి చిక్కిన బీబీ
- కలెక్టర్‌కి ఫిర్యాదుతో వెలుగులోకి అవినీతి - విచారణ పూర్తి... నివేదిక కలెక్టర్ చెంతకు
- పబ్లిక్‌గా డిమాండ్ చేసి లంచం తీసుకున్న కార్యదర్శి
- ఇటువంటి లంచావతారిణిపై కఠిన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు పెట్టించాలని బాధితుల డిమాండ్
- వీడియో పరిశీలిస్తున్న ప్రజల్లో ఆవేశం, ఆగ్రహం
- అక్రమంగా రూ.కోట్ల ఆస్థులు వెనకేసినట్లు ఆరోపణలు
- హాట్‌టాపిక్‌గా వలసపాకల పంచాయితీ కార్యదర్శి బీబీ అవినీతి బాగోతం
- కార్యదర్శిపై చర్యలు లేకుండా లక్షల్లో డబ్బులు చేతులు మారుతున్న వైనం

పత్రాలన్నీ సక్రమంగా ఉన్నా... పంచాయితీలలో ప్రతీ పని జరిగేందుకు ప్రజలు నరకయాతన పడుతున్నారు. రూ.లక్షల్లో వేతనాలు పొందుతున్న కొందరు అధికారులు లంచాల కోసం జలగల్లా పీడిస్తున్నారు. పైసలిస్తే క్షణాల్లో చక్కబెడుతున్నారు. కాదంటే కాళ్ళరిగేలా తిప్పుకొంటూ వారి దారికి తెచ్చుకుంటున్నారు. ఇదే ధోరణితో వలసపాకల కార్యదర్శి ఉన్నిసా బీబీ లంచావతారిణిగా మారింది. ఇంటి పన్నులు తొలుత ఎక్కువగా వేయడం... ఆ తరువాత పన్నును తగ్గించడానికి వేలల్లో మాట్లాడు కోవడం...ఇక్కడ మామూలే. అయితే అంత డబ్బు ఇచ్చుకోలేని బాధితులు తెగించి..బరి తెగించిఅవినీతికి పాల్పడుతున్న వలసపాకల కార్యదర్శి బీబీ బాగోతాన్ని కెమెరాలో బంధించి నేరుగా జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లాకు ఫిర్యాదు చేశారు. దాంతో కదలిన యంత్రాంగం విచారణ పూర్తి చేసి... నివేదిక కలెక్టర్‌కి అందించారు. ఇక చర్యలే తరువాయిగా ఉంది. అసలు కార్యదర్శి దన దాహం... వీడియోలో ఏముంది.. బాధితుల ఆవేదన ఏమిటో పరిశీలన చేద్దాం...

ఉమ్మడిగోదావరి జిల్లాల సూర్యబ్యూరో :

- మిగతా 2 లో..

వీడియోలో కార్యదర్శి, బాధితుల సంభాషణల వివరాలు :

బాధితుడు : మేడం గారు ట్యాక్స్ ఎక్కువ వేసారు అంటున్నారు.
కార్యదర్శి : ట్యాక్స్ తగ్గించి వేసాము. రూ.3,020.
మీరు మాట్లాడిన తరువాత 1000 తగ్గింది... ఇంకెంటి.
బాధితుడు : ఇంకా తగ్గించాలి అండీ
కార్యదర్శి : 1000 తగ్గింది అంతకన్నా ఎంత తగ్గుతుంది చెప్పండి
బాధితుడు : ప్రతీ సంవత్సరం 35% పెరుగుతుందని గుమస్తా చెప్పారు.
కార్యదర్శి : 35% కాదండి 5 శాతం మాత్రమే.రూ.3,000ట్యాక్స్ పడింది.రూ.1000 తగ్గించాం.మీరు చెప్పండి.ఇంతకన్నా తగ్గదు.
బాధితుడు : ఫార్మాలిటీ తగ్గిస్తారా ?
కార్యదర్శి : ఎంత చెప్పారు ?
బాధితుడు : రూ.12 వేల ఎనిమిది వందలు.
కార్యదర్శి : ఎనిమిది వందలు తీసేసి పన్నెండు వేలు ఇవ్వండి.
బాధితుడు : కాదండి కాదండి
కార్యదర్శి : పోనీలెండి వెయ్యి తగ్గింది పదకొండు వేలు ఇవ్వండి.
బాధితుడు : పదివేలు తీసుకోండి
కార్యదర్శి : పదివేల ఐదు వందలు ఇవ్వండి.

పై సంభాషణను బట్టి చిన్న పిల్లాడికి కూడా అర్థం అవుతుంది, కార్యదర్శి రూ.వెయ్యి తగ్గించి ఇంటి పన్ను వేయడానికి లంచంగా రూ.పదివేల ఐదు వందలు ఫార్మాలిటీ అడిగినట్లు ఉంది. అదే వీడియోలో బరితెగించి రూ. పదివేలు కార్యదర్శి తీసుకుంది. ఇంత బరితెగించి లంచం తీసుకొన్న ఆమెను అరెస్టు చేయకుండా అక్కడే విధులు నిర్వహించడం వెనుక లక్షల్లో డబ్బులు చేతులు మారినట్లు.. ఓ చోటా లీడర్ ఈ వ్యవహారంలో చక్రం తిప్పినట్లు తెలుస్తోంది..

ద్వాక్రా ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ,మేజర్ న్యూస్: స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం కృషితో తయారు చేసే ఉత్పత్తులను (ద్వాకా) ప్రతీ ఒక్కరు ప్రోత్సహించాలనిసిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక 9వ డివిజన్ పరిధిలోని భగీరథ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను శనివారం ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభించారు. డ్వాక్రా సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను అక్కడ ప్రదర్శించారు.

పచ్చళ్ళు, దుస్తులు, చేతివృత్తులు, జంతికలు, స్వీట్లు వంటి ఆహార వస్తువులతోపాటు దాదాపు 25 రకాల వస్తువులను అక్కడ స్టాల్స్‌లో ప్రదర్శించారు. వీటిని ఎమ్మెల్యే ద్వారంపూడి తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాలు ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించేందుకు ప్రభుత్వంఎంతో కృషి చేస్తోందన్నారు. ఆయా పథకాలు ద్వారా వచ్చే నిధులను సద్వినియోగం చేసుకుని మహిళలు సొంతంగా ఉత్పత్తులుతయారు చేయడం ఎంతో అభినంద నీయమన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయం కల్పించే లక్ష్యంతో వీటిని ఏర్పాటుచేసినమెప్మా యంత్రాంగాన్ని ఎమ్మెల్యేఅభినందిం చారు. అలాగే రుచికరమైన ఆహారాన్ని తక్కువ ధరకు విక్రయించే నమూనా ఆహా క్యాంటిన్లను కూడా ఎమ్మెల్యే సందర్శించారు. ఆన్‌లైన్ ద్వారా డ్వాక్రా ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే జగనన్న ఈ-మార్ట్ ప్రక్రియను కూడా ఎమ్మెల్యే సందర్శించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు,మెప్మా పీడీ ప్రియం వద, వైఎస్ఆర్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు, మాజీ కార్పొరేటర్లు కంపర బాబి, పలక సూర్యకుమారి, పలువురు స్థానిక నాయకులు ఎన్.వి. సాయిబాబా తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

'ఆశా'ల సమస్యల పరిష్కారానికై 8న ఛలో విజయవాడ

రంపచోడవరం, మేజర్ న్యూస్ : ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికై ఫిబ్రవరి 8న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. రంపచోడవరం సీఐటీయూ ఆఫీస్‌లో శనివారం ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం కలింకోట రమణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకురాలు మట్ల వాణిశ్రీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఫిబ్రవరి 8న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ఏజెన్సీ 11 మండలాల ఆశా వర్కర్లు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కనీస వేతనం పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద భీమా సౌకర్యం, సంక్షేమ పథకాలు, 66 రోజులు దీక్షల్లో ఇచ్చిన హామీలు అమలుకై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెన్సీ ఏడు మండలాల ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే 'ఆడుదాం - ఆంధ్ర'

- కార్పొరేషన్ కమిషనర్ నాగ నరసింహారావు
- నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం

కాకినాడ, మేజర్ న్యూస్ : క్రీడాకారుల్లో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం - ఆంధ్ర పేరుతో వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం- ఆంధ్ర పోటీలను కమిషనర్ నాగ నరసింహారావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణాల్లోని మురికివాడల్లోనూ ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నప్పటికీ ప్రతిభను చాటే అవకాశం రావడం లేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి క్రికెట్, కబడ్డీ,ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి ఆటల పోటీలకు శ్రీకారం చుట్టారన్నారు. తొలుత సచివాలయ పరిధిలోను, ఆ తరువాత నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలునిర్వహించి ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేయడంతో పాటు ఇతర ప్రోత్సాహకాలు కూడా అందిస్తోందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని క్రీడాకారుల సద్వినియోగం చేసుకొని ఉత్తమ క్రీడాకారులుగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను కమిషనర్ పరిచయం చేసుకున్నారు. స్వయంగా క్రికెట్ ఆడి క్రీడా పోటీలు ప్రారంభించారు.తొలుత కమిషనర్, ఇతర అధికారులు బెలూన్లు ఎగురవేసి నియోజవర్గ స్థాయి పోటీలకు శ్రీకారం చుట్టారు.

ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస కుమార్, ఆయా క్రీడలకు సంబంధించిన కోచ్ లు పాల్గొన్నారు.

సందేహాలను నివృత్తి చేయండి

- మున్సిపల్ కమిషనర్‌కు జనసేన రిప్రజంటేషన్

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసెన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ సూచనలతో పార్టీ రాష్ట్ర సమ్యుక్త కార్యదర్శి వాశిరెడ్డి శివ మరియు ఉపాధ్యక్షుడు అడబాల సత్యన్నారాయణల ఆధ్వర్యంలో శనివారం కాకినాడ మునిసిపల్ కమీషనర్కి తమ అధినాయకులు పవన్ కళ్యాణ్ సంధించిన ప్రశ్నలకు వివరణలు కోరుతూ రిప్రజెంటేషన్ సమర్పించారు.ఈ సందర్భంగా రాష్ట్ర సమ్యుక్త కార్యదర్శి వాశిరెడ్డి శివ మాట్లాడుతూ నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి 60 రోజులలో ఎన్నికలని పెట్టుకుని ఈసమయంలో కులగణనను చేపించడంపైన తమకు మరియు ప్రజలకు చాలా సందేహాలు ఉన్నాయనీ ప్రజల తరపున తమ నాయకుడు శ్రీ.పవన్ కళ్యాణ్ గారు వేసిన ప్రశ్నలని నివృత్తి చేయవలసినదిగా నగరంలో కులగణని నిర్వహిస్తున్న కాకినాడ సిటి మునిసిపల్ కార్పోరేషన్ కమీషనరుకు రిప్రజెంటేషన్ సమర్పించి డిమాండ్ చేసారు.ఉపాధ్యక్షుడుఅడబాల సత్యన్నారాయణ మాట్లాడుతూ ఇలా సేకరిస్తున్న వివరాలలో కులగణన అయితే అదొక్కటే చేయకుండా, వారి గోత్రం, వివాహితులా, పిల్లలు పుట్టారా లేదా లాంటి వ్యక్తిగత వివరాలు ఎందుకని ప్రశ్నించారు. ఈ వ్యక్తిగత వివరాలను ఎన్నికలలో దుర్వినియోగపరచడానికా సేకరిస్తున్నారు అని ప్రశ్నించారు. వినతిపత్రం సమర్పించాకా ఆ ప్రాంతంలోని ప్రజలకు ఈ కులగణనపై వివరిస్తూ కరపత్రాలను పంచి చైతన్యపరిచారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

వక్రమార్గాల్లో కార్పొరేషన్ సొమ్మును దోచుకుంటున్న ద్వారంపూడి

- కాకినాడలో టి.డి.ఆర్.బాండ్ల పేరుతో 251 కోట్ల మరో కుంభకోణం - కొండబాబు

కాకినాడ,మేజర్న్యూస్ : ప్రజల కష్టార్జితమైన కార్పొరేషన్ సొమ్మును వక్రమార్గాలలో కాకినాడ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి దోచుకుంటున్నాడని, టి.డి.ఆర్. బాండ్ల పేరుతో కార్పొరేషన్ సొమ్ము 251 కోట్ల కుంభకోణానికి తెరలేపి, టి.డి.ఆర్. బాండ్లుతో దోపిడీ శేఖర్ మరో 251 కోట్ల రూపాయలు దోచుకున్నాడని కాకినాడ సిటీ మాజీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన పత్రికా విలేఖరల సమావేశంలో ఆరోపించారు.ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక దుమ్ములపేట సమీప ప్రాంతము నందు సర్వే నెంబర్. 1986/3డి2 మరియు 1989/1ఎ, 4ఎ గల 4 ఎకరాల 67 సెంట్ల ప్రైవేటు స్థలములకు కాకినాడ నగరపాలక సంస్థ నుండి గజం 28 వేలు చొప్పున 1:4 గా సుమారు 251 కోట్ల విలువ చేసేటువంటి టి.డి.ఆర్. బాండ్లను మంజూరు చేయించి ఎమ్మెల్యే దోచుకున్నాడని, ఇదే ప్రాంతమును ఆనుకొని కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో అనేక ప్రభుత్వ భూములు మరియు పోర్టు భూములు ఉండగా ద్వారంపూడి తనకి లబ్ధి చేకూరేలా ప్రైవేట్ భూములను ఎంపిక చేసి వాటికి గుట్టుచప్పుడు కాకుండా 251 కోట్లు టి.డి.ఆర్. బాండ్లు మంజూరు చేయించాడని, వక్రమార్గాల్లో కార్పొరేషన్ సొమ్మును దోచుకుంటున్న ద్వారంపూడికి సహకరించలేక గత కమిషనర్లు బదిలీలపై వెళ్లిపోవడంజరిగిందని,ప్రస్తుతకమిషనర్ నాగనరసింహారావు ద్వారంపూడి దోపిడికిసహకరిస్తూకార్పొరేషన్‌సొమ్ములను దుర్వినియోగం చేస్తూ కార్పొరేషన్ ఖజానాను గుల్ల చేస్తున్నాడని, కాకినాడ నగర ప్రజలు పన్నుల రూపంలో కార్పొరేషన్‌కు చెల్లిస్తున్న సొమ్మును ఎమ్మెల్యే ద్వారంపూడి వక్రమార్గాల్లో దోచుకుంటున్నాడని, గతంలో ఈ విధంగానే కార్పొరేషన్ పరిధిలోగల సురేష్‌నగర్ ప్రభుత్వ భూములపై ప్రైవేట్ వ్యక్తులకు టి.డి.ఆర్. బాండ్లు మంజూరు చేసి కార్పొరేషన్ సొమ్మును దుర్మునియోగం చేశాడని, ద్వారంపూడి చేసిన సురేష్‌నగర్ ప్రభుత్వ భూమిపై టిడిఆర్ బాండ్లు దోపిడీకి అప్పటి అధికారులు బలయ్యారని, కాకినాడ కార్పొరేషన్‌కు స్పెషలాఫీసర్‌గా జిల్లా కలెక్టర్ ఉన్నప్పటికి కార్పొరేషన్ సొమ్మును ఈరకంగా దోచుకుంటున్నా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం వలన ఇటువంటివి పునరావృతం అవుతున్నాయని పేర్కొన్నారు. కార్పొరేషన్ సొమ్ము దుర్వినియోగంపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి కార్పొరేషన్ మంజూరు చేసిన టి.డి.ఆర్. బాండ్లను రద్దు చేసి ప్రభుత్వ ఖజానాను కాపాడాలని కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వారికి, మరియు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని కొండబాబు తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, పలివెల రవి, తుమ్మల రమేష్, గదులసాయిబాబా,సీకోటి అప్పలకొండ, ఒమ్మిబాలాజీ, కొల్లాబత్తుల అప్పారావు, బంగారు సత్యనారాయణ, గాది శివ, చోడిపిల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయశాఖ ప్రతినిధిగా అయోధ్యకు డిసి

కాకినాడ,మేజర్న్యూస్ : దేవాదాయశాఖ అధికారికంగా ఐదుగురు ప్రతినిధుల బృందాన్ని అయోధ్య రామ మందిరం చూసేందుకు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో భాగంగా ఈ ఐదుగురు బృందంలో కాకినాడ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు కూడా ఉన్నరు. అధికారికంగా ప్రభుత్వం తరపున ఆ శాఖ ఆధ్వర్యంలో ఈ కమిటీ రామమందిరానికి వెళుతోంది. దేవాదాయశాఖ తరపున స్వామివారికి కానుకలు సమర్పించనున్నారు. తన పూర్వజన్మ సుకృతం వల్ల తనకీ అదృష్టం కలిగిందని డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు.

నాటు సారా బట్టిపై దాడి

- 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- నిందితుడు రిమాండ్‌కు తరలింపు

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోని కిమ్మలిగెడ్డ గ్రామానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసి అతను వద్దనుండి 50 లీటర్ల సారా సీజ్ చేసి రిమాండ్ నిమిత్తం శనివారం అడ్డతీగల కోర్టుకు తరలించినట్లు ఎస్సై వెంకయ్య తెలిపారు. ఎస్సై వెంకయ్యకు వచ్చిన సమాచారం మేరకుకిమ్మలిగెడ్డ గ్రామ శివారు రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో కాకర జోగిరాజు నిర్వహిస్తున్న సారా బట్టి పై శుక్రవారం తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి 1000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 50 లీటర్ల సారా సీజ్ చేసి జోగి రాజును అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి అడ్డతీగల జెఎఫ్‌సిఎం కోర్టుకు తరలించినట్లు ఎస్సై వెంకయ్య తెలిపారు.

విప్పర్తిని సత్కరించిన సీనియర్ సిటిజన్స్ ఫోరం

అంబాజీపేట, మేజర్ న్యూస్ : పుల్లేటికుర్రులో సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ మరియు పి.గన్నవరం నియోజకవర్గం వైయస్సార్ పార్టీ ఇన్‌చార్జ్, నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించిన విప్పర్తి వేణుగోపాలరావును శనివారం సత్కరించారు. తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా వేణు గోపాలరావు కోరారు. ఈ కార్యక్రమంలో వక్కలంక రాధాక్రిష్ణ, అయ్యగారి వెంకట్రామయ్య, అయ్యగారి సుబ్రహ్మణ్యం, పాణింగపల్లి క్రిష్ణారావు, బెహర హనుమంతరావు, కాకర నర్సింహారావు, కొల్లి వెంకట్రావు, బీర జగన్నాధం, బొక్కా సత్యనారాయణ, అందే సుబ్రహ్మణ్యం, కముజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హసన్‌బాదలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

రామచంద్రపురం,మేజర్న్యూస్ : రామచంద్రపురం మండలం హసన్‌బాద గ్రామంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో అధ్యక్షతన రాచంద్రపురం నియోజకవర్గ బీజేపీ నాయకులు దూడల శంకర నారాయణ,ఇతర బీజేపీ నాయకులు ముఖ్య అతిథిలుగా పాల్గొని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ 2023 నవంబర్ 15వ తేదీన అటవీ ప్రాంత స్వాతంత్ర్య సమరయోధుడు, మిలీరియన్ ఉద్యమ కారుడు బిర్సా ముండాల్ జయంతి, ఆదివాసి గౌరవ్ దివశ్ సందర్భంగా వికసిత్ భారత్ సంకల్పయాత్రను మన ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారని, 24 రాష్ట్రాలలో 68 జిల్లాలలో 8,500 గ్రామ పంచాయితీలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలను వాటి ఉపయోగాలను ప్రజలకు వివరించాలని వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహిస్తున్నారని అందులో భాగంగా హసన్‌బాద గ్రామంలో ఈ కార్యక్రమం జరుతోందని తెలియజేసారు. గ్రామ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక సంక్షేమ పథకాలు గురించి వివరిస్తూ తద్వారా హసన్‌బాద గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి గురించి గ్రామ ప్రజలకు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులే కాకుండా గ్రామ ప్రజలు కూడా గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. బహిరంగ

మల విసర్జన చేయరాదని, ప్లాస్టిక్ వాడకం నిషేదించాలని, తడి చెత్తని పొడి చెత్తని వేరు చేసి పారిశుధ్య కార్మికులను ఇవ్వాలని, డ్రైనేజీలలో వ్యర్థ పదార్థాలు వేయకుండా మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రధాని మంత్రి నరేంద్ర మోడీని గత పది సంవత్సరాలుగా ప్రజలు ఆదరించడం వలన మన దేశం గర్వపడే విధంగా అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని వారిని కొనియాడారు. అందులో భాగంగా అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేపట్టడం చాలా గొప్ప విషయమని తెలియజేస్తూ హసన్‌బాద గ్రామ ప్రజలు అయోధ్య రాముడ్ని దర్శించుకొనుటకు త్వరలో బస్సు యాత్రను నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో చక్కటి సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి పాటు పడుతున్నారని వారికి, గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్‌కి, వారి తనయుడు పిల్లి సూర్య ప్రకాష్‌కి, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నాయకులు దూడల శంకర నారాయణ మాట్లాడుతూ ప్రధాని మోడీ ఒక విజన్‌తో దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలు మన నియోజకవర్గ ప్రజలందరికీ అందేల మా వంతు కృషి చేస్తామని తెలిపారు. ఆయుస్మాన్ హెల్త్ కార్డులను బీజేపీ నాయకులు దూడల శంకర నారాయణ చేతుల మీదుగా గ్రామస్థులకు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులను సర్పంచ్ నాగిరెడ్డి సతీష్ రావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈపీఓఆర్డి డేవిడ్‌రాజు, హసన్‌బాద బీజేపీ నాయకులు దొంతంశెట్టి ఓం ప్రకాష్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ, రెవిన్యూ, సచివాలయం, ఆరోగ్య, అంగన్వాడీ, ఎంజీఎన్ఆర్జిఎస్, డ్వాక్రా సిబ్బంది, వాలంటీర్స్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు పక్రియను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

అల్లవరం, మేజర్ న్యూస్ : బెండమూరులంక గ్రామంలో ఈ పంట నమోదు పక్రియను జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు పరిశీలించారు. ఈ పంట నమోదు జరిగిన రికార్డులను సూపర్ చెక్ రూపంలో రైతుల పేర్లు, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, పంట పేరు, పంట రకం, నాటిన తేదీ మొదలగు వివరాలు తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లవరం మండలంలో ఇప్పటి వరకు 1600 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అవ్వగా 1300 ఎకరాల్లో ఈ పంట పూర్తి అయిందని అన్నారు. ఈ పంట నమోదు ప్రక్రియను ఫిబ్రవరి 15వ తేదీ లోపు పూర్తి చెయ్యాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. వరినాట్లు త్వరగా పూర్తిచెయ్యాలని రైతులకు సూచించారు. నీటి ఎద్దడి వస్తే తమ దృష్టికి తీసుకొని వస్తే నీటిపారుదల శాఖ వారికి తెలియచేస్తామని రైతులకు సూచించారు. తదుపరి కోడూరుపాడు గ్రామంలో ఈ పంటను నమోదు పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్.వి.వి.సత్యనారయణ, వైస్ ఎంపిపి ముత్యాల రామకృష్ణ, సర్పంచ్ బర్రె సీతారత్నం, గ్రామ వ్యవసాయ సహాయకురాలు జె.విజయలక్ష్మి, విఆర్‌వో మెట్ల బాబ్జీ, రైతులు గుర్రం నాగభూషణం, ఈలి స్వామి, రోళ్ళ వెంకటరత్నం మొదలగువారు పాల్గొన్నారు..

అచ్చెన్నాయుడిని కలిసిన డాక్టర్ కాద వెంకటరమణ

రామచంద్రపురం, మేజర్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుని మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రామచంద్రపురం తెలుగు దేశం పార్టీ నాయకుడు, సత్య స్కాన్ మరియు డయాగ్నోస్టిక్స్ గ్రూపు అధినేత డాక్టర్ కాద వెంకటరమణ శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం తెలుగుదేశం శాసనసభ సీటును తనకు కేటాయించాలని కోరుతూ ఈ మేరకు డాక్టర్ కాద వెంకటరమణ అభ్యర్థనను అందచేశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు. రామచంద్రాపురం నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు అన్ని స్థాయిలలోని నాయకులతో కలిసి సమన్వయంతో కృషిచెయ్యాలని అచ్చెన్నాయుడు డాక్టర్ కాద వెంకటరమణకు సూచించారు. ఇటీవల మండపేటలో జరిగిన తెలుగుదేశం రా.. కదలిరా కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు సమక్షంలో డాక్టర్ కాద వెంకటరమణ పార్టీలో చేరిన విషయం అందరికి తెలిసిన విషయమే.

ఒక కళాశాల 5 గ్రామాలను దత్తత తీసుకొని గ్రామాభివృద్ధికి తోడ్పడాలి

-ఉన్నత్ భారత్ అభియాన్ రీజినల్ కోఆర్డినేటర్ డా.పావని భీశెట్టి

కొవ్వూరు, మేజర్ న్యూస్ : ఉన్నత్ భారత్ అభియాన్ కేంద్ర ప్రభుత్వ సంస్థ గ్రామాభివృద్ధి విద్యాసంస్థల, విద్యార్థుల సహకారముతో చేయుట దీని ప్రధాన లక్ష్యం అని ఉన్నత భారత్ అభియాన్ రీజినల్ కోఆర్డినేటర్ డా.పావని భీశెట్టి అన్నారు.శనివారం స్థానిక ఎబిఎన్&పి ఆర్ఆర్ కళాశాలలో ఉన్నత్ భారత్ అభియాన్ శాఖను ప్రారంభించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటుచేసిన ఉన్నత్ భారత్ అభియాన్ సబ్జెక్టు ఎక్స్పర్ట్ గ్రూప్స్ పై అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈ ఉన్నత్ భారత్ అభియాన్ లో విద్యాసంస్థలో వున్న యాజమాన్యం, ప్రిన్సిపాల్,అధ్యాపకులు విద్యార్థులుఅందరి భాగస్వామ్యం తోపనిచేయాలన్నారు. ఒక కళాశాల ఐదు గ్రామాలలను దత్తత తీసుకొని గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉన్నత్ భారత్ అభియాన్ కు సమర్పిస్తే వారు దానికి సంబంధించి గ్రాంట్ విడుదల చేసి గ్రామాభివృద్ధికి తోర్పాటు అందించుట జరుగుతుందని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉన్నత్ భారత్ అభియాన్ కోఆర్డినేటర్ డా రమేష్ మాట్లాడుతూ ఏబీఎన్& పిఆర్ఆర్ కళాశాల ఆరికరేవుల, కుమార దేవం, నందమూరు ,పసివేదల,దొమ్మేరుగ్రామాలనుదత్తత తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలో కళాశాల అధ్యాపకసిబ్బంది, కొవ్వూరు ప్రభుత్వ కళాశాల కోఆర్డినేటర్ వి.శ్రీనివాస్, దేవరపల్లి బిహెచ్ఎస్ఆర్ కళాశాల కోఆర్డినేటర్ పొలమటి రాజు,గోపాలపురం కొండవీటి కళాశాల కోఆర్డినేటర్ బి.విజయకుమార్, సంస్కృత కళాశాల కోఆర్డినేటర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

శివాలయానికి రూ.10 వేలు విరాళం అందజేసిన భక్తుడు

ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామ జిల్లా ఎటపాక మండలం బుట్టయిగూడెం గ్రామంలోని శివాలయానికి కూనవరం మండలం గొమ్ము అయ్యవారిగూడెం గ్రామానికి చెందిన కర్నాటి శ్రీనివాసరావు బుట్టాయగూడెం గల శివాలయ కమిటీకి విరాళంగా పది వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు కర్నాటి మోహన్ ఛత్రిష్ ఫుడ్ ఎన్. ఐ. టి రాయ్ పూర్‌లో అసిస్టెంట్ ప్రొఫసర్ జాయిన్ అయిన సందర్భాన్ని పురస్కరించుకుని నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి తమ వంతుగా విరాళాన్ని ఇవ్వడం జరిగిందని తెలిపారు.ఈ నగదు మొత్తాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అరవ కామేశ్వరరావు,కుసుమ రాజు సురేష్,పులుసు కోటేష్,తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ ఎలైట్ చే గణతంత్ర పురస్కారాలు

కాకినాడ, మేజర్ న్యూస్ : నిత్యము సేవా కార్యక్రమాలో నిమగ్నమవ్వడమే కాక దేశసేవ కోసం పాటుపడిన పలువురిని గణతంత్ర పురస్కారాలతో లయన్స్ ఎలైట్ క్లబ్ ఘనంగా సత్కరించింది. గణతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక చల్లా ఫంక్షన్ హాల్‌లో క్లబ్ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగింది. తొలుత జాతీయ పతాకాన్ని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్, క్లబ్ వ్యవస్థాపకులు ముంజలూరి విశ్వేశ్వరరావు ఎగురవేసి సభ్యుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్‌తో పాటు సామాజిక సేవకులను ఎంపిక చేసి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా వారి సేవలను గుర్తించడమే కాక నేటి తరానికి వాటి విశిష్టతను పరిచయం చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. లయన్స్ ఎలైట్ క్లబ్ నిత్యము సామాజిక సేవ, విద్య, వైద్య, క్రీడా రంగాలలో అనేక కార్యక్రమాలను చేపడుతూ క్లబ్ సభ్యులు సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నారని విశ్వేశ్వరరావు అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా విశ్రాంత ఆర్మీ అధికారి పిరాడి మంగరాజు, విశ్రాంత ఎయిర్ ఫోర్స్ అధికారి ఎం.వి.ఎస్.సూర్యనారాయణమూర్తి, సామాజిక సేవకులు గొల్లపల్లి గురుబాబు, నరసింహారావు లను క్లబ్ అధ్యక్షులు ఎన్.వి.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ కటకం శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కిషోర్, కోశాధికారి రాఘవరావు, మండలిక శాస్త్రి, గుంటూరు సత్యనారాయణ, చల్లా నిరంజన్, సత్తిరెడ్డి, గొర్రెల సూర్యనారాయణ, ఆర్.విఠల్, మైలవరపు సత్యనారాయణ (ఎం.ఎస్.ఆర్), సాయి, సాగర్, ఫణి, ఎం.ఎస్.ఎన్ ప్రభృతులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత పిరాడి మంగరాజు మాట్లాడుతూ దేశ సంరక్షణలో తమకు ఎదురైన అనేక అనుభవాలను, భారతదేశ గొప్పతనాన్ని అద్భుతంగా వివరించారు. ప్రపంచంలోనే భారతదేశ సైనికులు అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటారని మరియు నియమ నిబంధనలు కూడా ఇతర దేశాలు గౌరవించడం గొప్ప విషయం అన్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా సన్మానాన్ని పొందడం చాలా ఆనందంగా ఉందని, సేవాస్ఫూర్తి కలిగిన వ్యక్తుల నుండి సన్మానం స్వీకరించడం గర్వంగా ఉందని మంగరాజు అన్నారు.

లంచావతారిణి కార్యదర్శి..వేలల్లో ఫార్మాలిటీస్

అవినీతిలో కూరుకపోతున్న వలసపాకల పంచాయితీ

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :

విధి నిర్వహణ కంటే అక్రమార్జన పైనే ధ్యాసతో అధికారులు పనిచేస్తున్నారని మరోసారి రుజువైంది. ప్రభుత్వం నుంచి నెలకు అందుకుంటున్న వేతనానికి, వారి ఆస్తులకు ఎక్కడా పొంతన కుదరలేదు. అవినీతి బాగోతాలు బయటపడటం.. లంచాలకు భారీగా అలవాటు పడినట్టు వార్తవుల వస్తున్న నేపథ్యంలో ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకోవడం జరుగుతోంది. అయితే కాకినాడ రూరల్ వలసపాకల కార్యదర్శి ఉన్నిసాబీబీ గ్రామ ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ పారదర్శకంగా పనిచేయాల్సిన ఆమె..పైసలు ఇస్తే తప్ప పని చేయట్లేదు. ప్రతిష్టాత్మకమైన జగన్ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాల్సింది పోయి అక్రమ వసూళ్ళకు తెర లేపింది. ఈమె చేసిన అక్రమవసూళ్ళను చూస్తే ఎవరైనా హవ్వఅనాల్సిందే.ఇదిఆమె అక్రమాల పర్వం. పెన్షన్ మంజూరు నుంచి ఇంటి పన్ను, నెంబర్ ఇవ్వాలన్నా, గృహ నిర్మాణాలకు అనుమతులు, పెట్రోలు బంకులకు అనధికార అనుమతులు, బార్‌లకు అనధికారఅనుమతులు,జనన,మరణ ధృవీకరణ పత్రాలు కావాలన్నా ఆమె అడిగినంత ఇవ్వాల్సిందే. లేదంటే ఫైల్ ముందుకు కదలదు, ఆ పని కాదు. పలు రకాల కారణాలు చూపి సంబంధిత ధరఖాస్తులను తిరస్కరిస్తుంది. ప్రతి పనికి రేటును నిర్ణయించి ఆ రేటు ప్రకారమే పని చేస్తుంది. ప్రజలకు కావాల్సిన న్యాయబద్ధమైన పని చేయాలంటే గ్రామస్తుల నుండి లంచం తీసుకోవడమే పెద్ద నేరం. ఓవైపు అవినీతి అక్రమాలకు పాల్పడుతూనే ప్రజలపై జులుం ప్రదర్శిస్తుంది. చిన్నా పెద్దా తారతమ్యం ఉండదు. ఎవరైనా వ్యతిరేకంగా మాట్లాడితే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయడ, చోటా లీడర్లతో బెదిరించేలా చేయడం వెన్నతో పెట్టిన విద్య. పంచాయితీ కార్యాలయం ఎదురుగా నిర్మించిన పెట్రోలు బంకు అక్రమ నిర్మాణం కోసం రూ. పది లక్షలు లంచంగా తీసుకున్న లంచావతారిణి కార్యదర్శి...అలాగేపంచాయితీకార్యాలయానికికూతవేటుదూరంలో ఉన్న తడాల భవంతి నిర్మాణానికి రూ.ఐదు లక్షలు లంచంగా తీసుకున్నారని తెలుస్తోంది. ఇలా ప్రతి పనికి ఓ రేటు కట్టడం లంచం తీసుకోవడం ఈమెకి వెన్నతోపెట్టినవిద్య. ఇలా గ్రామంలో పలు అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ వారి వద్దనుంచి లక్షల రూపాయలు సొమ్మును వక్రమార్గంలో అందుకుని కోట్లకి పడగలెత్తినట్లు చెబుతున్నారు.

బాధితుల కెమెరాకి చిక్కిన కార్యదర్శి..

పాలిక పద్మావతి అనే ఆమె నూతనంగా వలసపాకలలో ఇల్లు కొన్నారు. ఆమె కొన్న ఇంటికి పన్ను, డోర్ నెంబరు వేయడానికి కార్యదర్శి బీబీ ఫార్మాలిటీ డిమాండ్ చేశారు. ముందు 4,000 వేసిన పన్నును డబ్బులు..అదే ఫార్మాలిటీ.. ఇవ్వడానికి అంగీకరించిన తరువాత రూ.3,020 గా తగ్గించారు.దీనికి గాను బరితెగించి ఆమె కార్యాలయంలోనే పట్టపగలు పదివేల ఐదువందలు ఇవ్వాలని అడిగి...ఆపదివేలు నేరుగాతీసుకున్నకార్యదర్శి బీబీ..బాధితుడి నిఘా కెమెరాకి చిక్కారు.ఈ వ్యవహారంపై ఈ నెల 20వ తేదీ బాధితులు జిల్లా కలెక్టర్‌వారికి వీడియోలతో సహా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు ప్రకారం జిల్లా పంచాయితీ అధికారిణి భారతి సౌజన్య కలెక్టర్ ఆదేశాలతో డిఎల్‌పివోని నియమించివారి ద్వారా విచారణను పూర్తి చేసి నివేదిక డిపివో భారతి సౌజన్య ద్వారా కలెక్టర్ కృత్తికా శుక్లా కి చేరింది.

ప్రజల్లో ఆగ్రహావేశాలు..ఇంత బరితెగించి లంచాలు తీసుకుంటూ ప్రజలను వేధిస్తున్న పంచాయితీ కార్యదర్శి అవినీతి బాగోతంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. వీడియో జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. నేరుగా ఓ మహిళాకార్యదర్శిడిమాండ్‌చేసిపబ్లిక్‌గాలంచం తీసుకోవడం పై ఆ శాఖలో అవినీతి ఏ స్థాయిలో జరుగుతుందో అద్దం పడుతోంది. ఈమెను కఠినంగా శిక్షించి.. అవసరం మేరకు క్రిమినల్ కేసులతో అరెస్టు చేయడంవరకుచెయ్యాల్సినఅవసరంఉందనిప్రజలు భావిస్తున్నారు. దీనిపై కలెక్టర్ కృత్తికా శుక్లా ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం.

ఆశలు ఆశయాలుగా మార్చడమే నా ధ్యేయం - శ్యామ్

కాకినాడ, మేజర్ న్యూస్ : విద్యార్థుల ఆశలను ఆశయాలుగా మార్చడమే కాక జీవితంలో ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దడమే నా ధ్యేయమని శ్యామ్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు గుంటూరు శ్యామ్ అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పోలీసు అర్హత పరీక్షలలో రికార్డు సృష్టించిన శ్యామ్‌ను రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్.వి.ఎస్. రావు, అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను చేతులమీదుగా క్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ, కార్యదర్శి చందు లు సన్మానించి కానుకను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్బు సభ్యుల ఉద్దేశించి శ్యామ్ మాట్లాడుతూ 2001లో శ్యామ్ ఇనిస్టిట్యూట్ స్థాపించానని ఆనాటి నుండి అకుంఠితదీక్షతో పోలీస్ మరియు సివిల్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థినీవిద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు సుమారు 17వేల మందికి రాష్ట్ర ప్రభుత్వాలలో ఉద్యోగాలు వచ్చాయని చెప్పారు. నా ప్రపంచం నా కుటుంబం అంతా విద్యార్థులేనని అన్నారు. గత నాలుగు సంవత్సరాల కఠోర దీక్ష వల్ల తెలుగు రాష్ట్రాలలోనే ఎక్కువమంది పోలీసు శాఖకు అర్హత సాధించారని శ్యామ్ అన్నారు. రోటరీ వంటి సేవా సంస్థ చే సన్మానం స్వీకరించడం బాధ్యతలు మరింతగా పెంచాలని చెప్పారు. రోటరీ సభ్యులలో దాన గుణం మెండుగా ఉందని సమాజాభివృద్ధికి నిరంతరం సేవ చేస్తూ ఉంటారని చెప్పారు. క్లబ్ అధ్యక్షులు రవికృష్ణ

మాట్లాడుతూ నోటరీ గోల్డెన్‌జూబ్లీ క్లబ్‌కి ఉపాధ్యక్షులుగా శ్యామ్ బాధ్యతలు నెరవేరుస్తున్నారని అటువంటి వ్యక్తి ఇంతటి ఘనకీర్తిని సాధించడం అందరికీ గర్వకారణంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో మాచారెడ్డి, చిరంజీవి రెడ్డి, భూపేంద్ర, బల్ల సత్యపాల్, చోడిశెట్టి పద్మరాజు, డాక్టర్ యాతగిరి పరశురామ్, జీకే శ్రీనివాస్, లంక సాయి బాబు, ధన సాగర ప్రసాద్, బదిరెడ్డి వెంకన్న, డాక్టర్ సతీష్, డాక్టర్ సత్యమూర్తి, చేయూతరవితోపాటు అధికసంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.

గోవింద నామస్మనులతో ప్రతిధ్వనించిన వాడపల్లి

అత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమలగా కోరిన కోర్కెలు తీర్చే దైవంగా విరాజిల్లు తున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామివారి ఆలయం భక్తుల గోవింద నామ స్మరణతో ప్రతిధ్వనించింది. ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం అనే దానుడితో రాష్ట్రాలనుండి వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, పుణ్యా వచనం, కళ్యాణం తదితర కార్యక్రమాలను అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఆలయంలో నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. శనివారం స్వామివారి ఆదాయం రూ.28 లక్షలు సమకూరింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరు సత్యనారాయణ రాజు, కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళా అభ్యున్నతే సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం

- పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్



పిఠాపురం, మేజర్ న్యూస్ : మహిళా అభ్యున్నతే సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. పిఠాపురం మండలం డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. పిఠాపురం మండల పరిధిలో గల పదహారు వందల గ్రూపులలో గల పదహారువేల మంది మహిళలకు రూ. 13.51కోట్లు (అక్షరాల పదమూడు కోట్ల యాభై ఒక్క లక్షల రూపాయలు) చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా మహిళలకు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్రెడ్డికే దక్కుతుందన్నారు. తనకు పదవి వున్నా లేకపోయినా... నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వున్నానని, ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పని చేశానని అన్నారు.

ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ... ఎటువంటి లంచాలకు తావు లేకుండా సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలతో ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా వున్నారని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా... నవరత్నాల ద్వారా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందని అన్నారు. అనంతరం కార్యక్రమంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకార సేవ

అన్నవరం, మేజర్ న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణస్వామివారి సన్నిధిలో శనివారం సందర్భంగా ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకులు కంచి బొట్ల వరదయ్య, శ్రీ స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మంగళ వాయిద్యాల నడుమ తోడుకొని వచ్చి వివిధ రకమల సుగంధ భరితమైన పుష్పములతో అలంకరించిన తిరుచి వాహనంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రపుష్పములు సమర్పించి వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య, భక్తుల నామస్మరణ మధ్య, మంగళ వాయిద్యాలు నడుమ, తూర్పు రాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. శ్రీ స్వామివారి ప్రాకర సేవ కార్యక్రమంలో వేద పండితులు, ఆలయ అర్చకులు, ఆలయ సూపరిండెంట్ స్వామీజీ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పి.వేంకటేశ్వరరావు, ట్రస్ట్ బోర్డు మెంబర్ బద్రి, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సందర్శించిన సబ్ కలెక్టర్

రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సబ్ కలెక్టర్ యస్ ప్రశాంత్ కుమార్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో పలు విభాగాలను సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ పరిశీలించడం జరిగింది. ఆసుపత్రిలో ప్రతీ వార్డు సందర్శించి, చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. అలాగే హాస్పిటల్ రూమ్స్, ఆధునిక ల్యాబ్ పరీక్ష పరికరాలు గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ కు వివరించారు. ఆసుపత్రిలో పేషెంట్స్ తో సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడి వారి ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు లేకుండా మెరుగైన వైద్యం, మందులు, సౌకర్యాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి, ఆసుపత్రి కౌన్సిలర్ వాసు, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌కి వ్యతిరేకంగా వార్డు మెంబర్ల తీరు

– సర్పంచ్‌కి తెలియకుండా డిపివో అభ్యర్థన మీటింగ్ నిర్వహణ

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : ఆత్రేయపురం గ్రామ పంచాయతీకి 2020లో జరిగిన స్థానిక ఎన్నికల్లో దళిత సర్పంచ్‌గా గెడ్డం సుధా టిడిపి తరపున ఎన్నికయ్యారు. అయితే వార్డు మెంబర్లు అధికార పక్షానికి అనుకూలంగా గెలవడంతో ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు నుంచే దళిత సర్పంచ్ కు అధికార పార్టీ నుంచి వేధింపులు ప్రారంభమయ్యాయి. ఎదిరించినందుకు దళిత సర్పంచ్ గ్రామంలో ఒక్క రూపాయి కూడా అభివృద్ధి పనులు చేయకుండా అధికార పార్టీ నాయకులు, వారికి వత్తాసు పలుకుతున్న అధికారులు ఇబ్బందులు గురిచేస్తున్నారు. అంతేకాకుండా గ్రామపంచాయతీకి స్వాధీనం చేయని భూమిలో గ్రామానికి చెందిన సీసీ రోడ్డు వేసేందుకు అధికార పార్టీ వార్డ్ మెంబర్లు నిబంధనలు కు విరుద్ధంగా తీర్మానం ఆమోదించడం దానిని సర్పంచ్ వ్యతిరేకించడంతో వివాదం మరింత ముదిరింది. శనివారం గ్రామ సర్పంచ్ కి తెలియకుండానే జిల్లా డిపిఓ వి.కృష్ణకుమారి అభ్యర్థన మీటింగ్ ను గ్రామపంచాయతీలో నిర్వహిస్తుండడంతో విషయం తెలుసుకున్న సర్పంచ్ అక్కడికి చేరుకుని డిపోఓను నిలదీశారు. సర్పంచ్ కు కనీస సమాచారం ఇవ్వకుండా అభ్యర్థన మీటింగ్ నిర్వహించటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. గ్రామంలో కనీస అవసరాలు గుర్తించి అభివృద్ధి పనులు చేసేందుకు తాను ప్రయత్నిస్తుంటే అధికార పార్టీ నాయకుడికి స్వప్రయోజనం చేకూర్చే విధంగా పనులు ఆమోదించి వర్క్ కమిటి ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు అయినప్పటికీ సర్పంచ్ అభ్యంతరాలను లెక్కచేయకుండా డిపిఓ అధికార పార్టీకి అనుకూలంగా వర్క్స్ కమిటీని ఏర్పాటు చేసి కలెక్టర్ ఆమోదం కోసం నివేదికను పంపించావర్క్స్ కమిటీ ఏర్పాటుపై డిపిఓ కృష్ణకుమారిని వివరణ కోరగా వార్డ్ మెంబర్ల అభ్యర్థన మేరకు శనివారం అభ్యర్థన సమావేశమును ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సమావేశంలో ఎటువంటి పనులకు ఆమోదం తెలపలేదని కేవలం నిబంధనల మేరకు గ్రామ సర్పంచ్, కార్యదర్శి, ఇద్దరు వార్డు మెంబర్లు, స్వయం సహాయక గ్రూప్ నుంచి ఒకరు, ఎస్సీ సామాజికవర్గం నుంచి ఒకరిని, పనులు నిర్వహించే కాంట్రాక్ట్‌తో సహా ఏడుగురుతో వర్క్స్ కమిటీని మెజారిటీ వార్డ్ మెంబర్ల అభిప్రాయం మేరకు ఏర్పాటు చేసి కలెక్టర్ ఆమోదం కోసం పంపినట్లు తెలిపారు.

ఓటర్ల జాబితాపై వస్తున్న అభ్యంతరాలు, ఫిర్యాదులపై అత్యంత బాధ్యత వహించాలి

– సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్

కొవ్వూరు, మేజర్ న్యూస్ : ఓటర్ల జాబితా పై వస్తున్న అభ్యంతరాలు, ఫిర్యాదుల నేపథ్యంలో వాటి పరిష్కారం కోసం అత్యంత బాధ్యత వహించాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ ఆదేశించారు. శనివారం తాసిల్దార్ కార్యాలయంలో ఎ.ఈ.ఆర్.ఓ లకు, సూపర్ వైజర్లకు మరియు బి.ఎల్ ఓ లుకు సమావేశం నిర్వహించి సబ్ కలెక్టర్ దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా అశుతోష్ శ్రీవాత్సవ్ మాట్లాడుతూ, ఎస్ ఎస్ ఆర్ 2024 ప్రకారం ఓటరు జాబితా తుది జాబితా ప్రకటించడం జరిగిందన్నారు. కొవ్వూరు నియోజక వర్గ ఓటరు జాబితా కి చెంది ప్రస్తుతం వస్తున్న ఓటర్ల జాబితాల పై ప్రతికూల వార్తలను సంబంధిత అధికారులు, సిబ్బంది వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎటువంటి ఆలసత్వం వహించరాదని స్పష్టం చేశారు. ప్రతి బి ఎల్ వో పరిధిలో ఓటర్ జాబితాను మరోసారి సమగ్రంగా పరిశీలించి , తగు చర్యలు తీసుకోవాలని, సోమవారం నాటికి అన్ని దరఖాస్తులు ను ప్రాసెస్ పూర్తి చెయ్యాలని ఆదేశించారు.

శృంగార వల్లభ స్వామి దర్శనానికి పాటెత్తిన భక్తులు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఇఓ మరియు జిల్లా దేవదాయ శాఖ అధికారి పులి నారాయణమూర్తి, దేవస్థాన ఛైర్మన్ కర్రి జగదీష్‌లు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,70,700/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,25,706/-లు, కేశఖండన ద్వారా రూ.6,430/- వెరశి రూ.3,02,286/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి గోపాలాచార్యులు, ఎంపిటిసి కుంచె బుచ్చిరాజు, దేవస్థాన కమిటి సభ్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహనరావు, సత్యనారాయణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'ఎలక్ట్రీషియన్ డే' పురస్కరించుకుని బైక్ ర్యాలీ

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఎలక్ట్రీషియన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాసలపు సూర్యారావు భవనంలో జెండా ఆవిష్కరణ అధ్యక్షులు తాడిశెట్టి గంగ చేతుల మీదుగా చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి, మున్సిపల్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో కార్మిక అధికారి సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వర్కర్స్ అందరూ ఐక్యంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.ఎస్.కె.శ్రీనివాస్, బుడత సుధాకర్, నాళం శ్రీనివాస్, లంక చంటి, కె.దుర్గాప్రసాద్, బి.రాంబాబు, షేక్ భాష, ఆర్.రమేష్, సిఐటియు నాయకులు, గడిగట్ల సత్తిబాబు, శ్రీనివాస్, గూనూరు రమణ, వడ్డి సత్యనారాయణ, ప్రజానాట్యమండలి కళాకారుడి డి.సత్యనారాయణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించిన హౌసింగ్ ఏఇ

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : జిల్లా హౌసింగ్ పిడి మరియు హౌసింగ్ ఇఇ, హౌసింగ్ డిఇల ఆదేశాల మేరకు పెద్దాపురం మండల పరిధిలో జగనన్న కాలనీలలో ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్దిదారులకు అవగాహన కల్పించడం జరుగుతుందని హౌసింగ్ ఏఇ చదలవాడ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఆనూరు, కొండపల్లి, వాలుతిమ్మాపురం, సిబిదేవం, ఆర్.బి.కొత్తూరు, జి.రాగంపేట, వడ్లమూరు (గోరింట, చంద్రమాంపల్లి గ్రామాలతో), జె.తిమ్మాపురం, లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలను లబ్దిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఇ సుబ్రహ్మణ్యేశ్వరరావు లబ్దిదారులకు అవగాహన కల్పించారు. ఆయన తెలుపుతూ పెద్దాపురం మండలంలో జగనన్న లేఅవుట్‌లలో 909 గృహ నిర్మాణాలుకు గాను, సొంత స్థలాలలో 919 గృహ నిర్మాణాలతో కలిపి మొత్తం 1828 గృహ నిర్మాణాలు మంజూరు అయ్యాయని, వాటిలో లేఅవుట్‌లో 251, సొంత స్థలాలలో 712 గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయని ఏఇ తెలిపారు. మిగతా గృహాలు జగనన్న లేఅవుట్‌లో వివిధ స్థాయిలలో ఉన్నాయని, వాటిని కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లబ్దిదారులకు అవగాహన కల్పించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉత్తమ ప్రదర్శనగా 'ఇంద్రప్రస్థం'

– ముగిసిన స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ పోటీలు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : స్నేహ ఆర్ట్స్ నాటక పరిషత్ పోటీలలో చంద్రమంపల్లిలో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటక పోటీలు ఘనంగా ముగిసాయి. మూడు రోజుల పాటు సాగిన పోటీలలో మొత్తం 7 ప్రదర్శనలను ఆహ్వాన పోటీలలో పాల్గొనగా, వాటిలో ఉత్తమ ప్రదర్శనగా గుంటూరుకు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ వారి ప్రదర్శన ఇంద్రప్రస్థం నిలిచింది. నాటక పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు కె.శాంతారావు, గోగులపాటి సీతారామస్వామి, రాధాస్వామి పోటీల ఫలితాలను ప్రకటించారు. ఈ సందర్భంగా శాంతారావు మాట్లాడుతూ నాటక పోటీలను నిర్వహించడం చాలా సంతోషమని, నాటకం విజయవంతం అయింది అంటే నాటకాల ప్రదర్శన కన్న వాటిని చూడటానికి వచ్చిన ప్రేక్షకుల ఆదరణే ప్రధానమని తెలిపారు. నాటక రంగం జీవం పోసుకుంటున్న క్షణంగా ఇక్కడికి వచ్చినపుడు అనిపిస్తుంది అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. విజేతలకు మెమెంటోలను కె.ఎస్.ఎన్. కళాశాల నుండి అందజేశారు. ఈ సందర్భంగా స్నేహ ఆర్ట్స్ నుండి గొందేశి రాజా, ఇంధన బ్రహ్మానందం, పాలాని సత్తిబాబు, మంతెన సత్తిబాబు, కేదారి నాగు, మాగాపు నాగు, వెన్న పండు, రవీంద్ర, పాపేశ్వరరావు, గంగ, తదితరులు ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ద్వితీయ ప్రదర్శనగా హైదరబాద్ వారి లక్ష్మణరేఖ దాటితే నాటిక, తృతీయ ప్రదర్శనగా చైతన్య కళాభారతి కరీంనగర్ వారి స్వప్నం రాల్చిన అమృతం, జ్యూరీ ప్రదర్శనగా కళాంజలి, ప్రగతి నగర్ వారి రైతే రాజు నిలిచాయి. ఉత్తమ నటుడిగా లక్ష్మణరేఖ దాటితే నాటికలో విశ్వనాథ్ పాత్రధారి ఎస్.ఎం.భాష, ద్వితీయ ఉత్తమ నటుడిగా స్వప్నం రాల్చిన అమృతం నాటికలో కృష్ణప్రసాద్, ఉత్తమ నటిగా స్వప్నం రాల్చిన అమృతం నాటికలో స్వప్న పాత్రదారి ఉషశ్రీ, ద్వితీయ ఉత్తమ నటిగా కెరటాలు నాటికలో శాంతి, క్రాంతిదారి సాహితి, ఉత్తమ రచన రైతే రాజు నాటిక రచయిత కంచర్ల సూర్యప్రకాష్, ఉత్తమ దర్శకత్వం ఇంద్రప్రస్థం ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ప్రతి విభాగంలో జ్యూరీలను అందజేశారు.

ఘనంగా రావులమ్మ తల్లి ఆలయం వద్ద అన్న సమారాధన

– పాల్గొని అన్న ప్రసాదం వటించిన జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట గ్రామదేవత శ్రీ రావులమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఘనంగా అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ హాజరై రావులమ్మ దర్శనం చేసుకుని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. అనంతరం భక్తులతో కలిసి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా జీను మణి బాబు మాట్లాడుతూ జగ్గంపేట గ్రామదేవత కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి శ్రీ శ్రీ శ్రీరావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవం కనుమ పండుగ రోజు కన్నుల వైభవంగా జరిగిందని అనంతరం గ్రామంలోని ముఖ్య కాలనీలో వాసులు అందరూ వైభవంగా రావులమ్మ తల్లి సంబరం జరుపుతున్నారని శనివారం నాడు 4000 మందికి అన్న ప్రసాదం పంపిణీ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, జీను పెద్ద రాంబాబు,, పాంద్రంగి రాంబాబు, వివిబి ప్రసాదరావు, దాపర్తి సీతారామయ్య, బస్వా వీరబాబు,, బోండా రాజేష్, సుంకవిల్లి రాజు, కోదూరి రమేష్, గే డ్డమూరి బాబ్జి, నలమాటి ఆనంద్, డేగల సత్తిబాబు, రాయి సాయి, య ల్లమిల్లి సీఎం, పెనుమర్తి భాస్కరరావు, మానేపల్లి సాయి, సిరపు బాలాజీ రెడ్డి, పత్తి భీమేశ్వరరావు, దుగ్గిన సూరిబాబు, తులా నరసింహారావు, కింగం రామకృష్ణ, మారిశెట్టి గంగ, ఎండి కాజా, సంగిరెడ్డి రమేష్, పుర్రె వీరబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సగర పేటలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలోకి చేరిక

– హాజరైన జ్యోతుల నెహ్రూ, జ్యోతుల నవీన్

జగ్గంపేట, మేజర్ న్యూస్ : జగ్గంపేట మండలం బీసీ సెల్ అధ్యక్షులు పోంద్రు బాలనాగు ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం గుర్రంపాలెం గ్రామపంచాయతీలోని సగర పేటకు చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నక్క పెద్ద వెంకటేష్, తంగేళ్ల నాగరాజు, ములికి వీరప్పలరాజు, మునిగి అర్జున, పొంద్రు లావరాజు, పోంద్రు రాధాకృష్ణ, అప్పన్న తదితర 40 కుటుంబాలు రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువల తో స్వాగతం ముందుగా జ్యోతుల నెహ్రూకు సగరులు అందరూ పువ్వుల వర్షంతో స్వాగతం పలికారు. భగీరథ మహర్షికి పూలమాలతో అంజలి గట్టించిన జ్యోతుల నెహ్రూ, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సగరలు మాట ఇచ్చారంటే కట్టుబడే మనస్తత్వం అని రింగ్ రోడ్డు పూర్వం ఎలాగుండేది ఇప్పుడు ఎలా ఉందో ఒకసారి చూడండి అని అన్నారు. మీరు ఎక్కడున్నా ఎన్నికల నాటికి వచ్చి జ్యోతుల నెహ్రూ ఓటు వేసి గెలిపించాలని నవీన్ అన్నారు. నెహ్రూ మాట్లాడుతూ పాలకుల అసమర్థత వల్లే రైతులకు అపార నష్టం వాటిందని ఈ జగన్ రెడ్డి ఇంటికి పంపించి జనసేన తెలుగుదేశం సంకీర్ణ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్, అప్పలరాజు, మారిశెట్టి భద్రం, అడబాల వెంకటేశ్వరరావు, నీలం శ్రీను, కొత్త కొండబాబు, కుంచే తాతాజీ, సుంకవిల్లి రాజు, పాఠం శెట్టి రవి, మురళి రాజు, పడాల ధర్మరాజు, పొ ట్రూ కృష్ణ, పడాల విష్ణు, నక్క రామకృష్ణ, గండికోట రామస్వామి, పిండి సత్తిబాబు, నక్క వెంకటేశ్వర్లు, ములికి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా అభ్యున్నతే సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం

– పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు

– కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్



పిఠాపురం, మేజర్ న్యూస్ : మహిళా అభ్యున్నతే సీఎం జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, కాకినాడ ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. పిఠాపురం మండలం డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. పిఠాపురం మండల పరిధిలో గల పదహారు వందల గ్రూపులలో గల పదహారువేల మంది మహిళలకు రూ. 13.51కోట్లు (అక్షరాల పదమూడు కోట్ల యాభై ఒక్క లక్షల రూపాయలు) చెక్కును అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొరబాబు మాట్లాడుతూ... ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా మహిళలకు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తనకు పదవి వున్నా లేకపోయినా... నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో వున్నానని, ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పని చేశానని అన్నారు. ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ... ఎటువంటి లంచాలకు తావు లేకుండా సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలతో ఇంటివద్దకే పథకాలు అందిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా వున్నారని అన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా... నవరత్నాల ద్వారా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ కే దక్కుతుందని అన్నారు. అనంతరం కార్యక్రమంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

సిఐ, ఎస్సైల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సు

దేవిపట్నం, మేజర్ న్యూస్ : రోజు రోజుకు పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాలు, వివిధ లోన్ యాప్‌ల మోసాలకు, సారా మహమ్మారి వల్ల కలిగే నష్టాలను తెలియజేయడంలో భాగంగా, ఏ.ఎస్. ఆర్. జిల్లా దేవిపట్నం మండలంలోని, వి.రామన్నపాలెంలో ప్రజలకు అవగాహన కలిగించే కార్యక్రమాన్ని చేపట్టారు.ఎవేర్ నెస్ కార్యక్రమంలో భాగంగా యువత ద్వి చక్ర వాహనాలు నడిపే సమయం లో సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని ,హెల్ మెట్ ధరించి పెట్టుకోవడం వల్ల నష్టానివారణకు అవకాశం ఉందని తెలియజేసే తెలియజేశారు. గ్రామాల్లో నాటుసారా వల్ల అనారోగ్యాల బారిన పడి యువత భవిషత్తు నాశనం చేసుకోవద్దన్నారు. టెక్నాలజీ అందుబాటులో ఉందని అందువల్ల లోన్ యాప్ ల వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతాయని వీటిపై తప్పక అవగాహన కలిగి ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో రంపచోడవరం సి. ఐ. వి వేంకటేశ్వర రావు,దేవిపట్నం ఎస్. ఐ. నాగార్జున స్థానిక యువత, గ్రామంలో వారు పాల్గొన్నారు.

కోటలో గ్రూప్-1, గ్రూప్-2 పోటీ పరీక్షలకు ఉచిత అవగాహన సదస్సు

సామర్లకోట, మేజర్ న్యూస్ : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న సామర్లకోట మరియు పెద్దాపురం పరిసర ప్రాంత యువతి యువకులకు శుభవార్త..! శ్రీ గుణ్ణం చంద్ర మౌళి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రూప్-1 , గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు సిద్ధమవు తున్న యువతి యువకులకు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంచే ఫిబ్రవరి 4 వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయం త్రం 4 గంటల వరకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించబడును. ఈ సదస్సులో పరీక్ష కు సన్నద్ధ మెలకువలు మరియు సిలబస్ పై పూర్తి అవగాహన కల్పించనున్నారు. సదస్సుకు విచ్చేసిన ప్రతి ఒక్కరికి స్టడీ మెటీరియల్ ఇవ్వబడును.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటూ సదస్సు నిర్వహించు తేదీ:04-02-2024(ఆదివారం) సమయం:ఉదయం 9 గం" నుండి సాయంత్రం 4 గం" వరకు రిపోర్ట్ చేయాల్సిన సమయం:ఉదయం 8:30 గంటలకు వేదిక : షుగర్ ఫ్యాక్టరీ గెస్ట్ హౌస్,కేనాల్ రోడ్, సామర్లకోట కాంటాక్ట్ : 9133675999,7013671046

29 నుంచి విద్యుత్ ఛార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

– ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు నాలుగు రోజుల పాటు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ సామర్లకోట డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా విద్యుత్ ఛార్జీలపై తమ అభ్యంతరాలు, సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులు ఎవరైనా పాల్గొనవచ్చునని తెలిపారు. ఐదవ నియంత్రణ కాలం మొత్తానికి (2024-25 నుండి 2028-29 వరకు) పంపిణి, సరఫరా, ఎస్ఎల్‌డిసి వ్యాపారామునకు, సమగ్ర ఆదాయ అవసరాలు మరియు లివింగ్ ధరపై ప్రజాభిప్రాయ సేకరణ (వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విశాఖపట్టణం నుండి) నిర్వహించడం జరుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.వి.ఎన్.డి.ఎస్.ప్రభాకర్ తెలిపారు.

శ్రీ సత్యదేవా జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు

అన్నవరం, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం నెహ్రూ యువ కేంద్ర కాకినాడ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలులో భాగంగా శ్రీ సత్య దేవా జూనియర్ కళాశాల అన్నవరం యువత శాంతియుతంగా ఉండాలని సూచించారు. స్వామి వివేకానంద, మహాత్మా గాంధీ చెప్పిన విదంగా అందరూ ఐక్యంగా కలసి మెలసి శాంతియుతంగా జీవనాన్ని గడపాలని అప్పుడే మన మనస్సు శరీరం మనం చెప్పిన విధంగా ఉంటుంది అని తెలిపారు. అలాగే మనం అనుకున్న గమ్యాలను కూడ త్వరగా చేరడానికి వీలు పడుతుంది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర శంఖవరం బ్లాక్ వాలంటీర్ ఎస్.సాయిబాబు మరియు స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకట్, కళాశాల సిబ్బంది వీరభద్రరావు, సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.

జెఎన్టీయుకె స్టేడియంలో 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్

– నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న ఎంపి వంగా గీతా విశ్వనాథ్

కాకినాడ, మేజర్న్యూస్ : జెఎన్టియుకె స్టేడియంలో ఖేలో ఇండియా పథకంలో భాగంగా మంజూరైన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి ఆదివారం ఉదయం 9.30గంటలకు గౌరవనీయులైన పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ శంఖుస్థాపన చేయనున్నట్లు ఉపకులపతి ప్రొ. జివిఆర్.ప్రసాదరాజు తెలిపారు.

జెఎన్టియుకె యూనివర్శిటీకి ఖేలో ఇండియా పథకంలో భాగంగా మంజూరైన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్ నిర్మాణానికి మొత్తం రూ.13.55 కోట్ల నిధులు అవసరం కాగా కేంద్ర ప్రభుత్వం రూ.9.50కోట్లు మంజూరు చేయగా దానికి మ్యాచింగ్ గ్రాంట్ గా యూనివర్శిటీ నుండి రూ.4.05కోట్లు నిధులు విడుదల చేయడం జరుగుతుందని ఉపకులపతి తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, జిల్లా అధికారులు, యూనివర్శిటీ అధికారులు, నగర ప్రముఖులు, క్రీడాకారులు హాజరవుతారన్నారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో కలెక్టర్ అవార్డు అందుకున్న పెరవలి మండల అధికారులు

పెరవలి, మేజర్ న్యూస్ : పెరవలి మండల ప్రజాపరిషత్ ఆఫీసులో టైపిస్ట్‌గా పనిచేయుచున్న కోన వెంకట్ వేణు జనవరి 26వ తేదీ శుక్రవారం లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో గ్రామ సచివాలయ ఉద్యోగులతో చక్కటి సమన్వయంతో పనిచేసినందుకు ఉత్తమ సేవా అవార్డును తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవిలత చేతుల మీదుగా అందుకున్నారు. కోన వెంకట్ వేణు ప్రస్తుతం పెరవలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పని చేయుచు పెరవలి మండలానికి చెందిన గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ చక్కగా పనిచేస్తున్నారని వీరికి ఈ అవార్డు లభించినట్లు తెలిసింది. అదేవిధంగా పెరవలి మండల పరిషత్ కార్యాలయంలో మండల ఇంజనీరింగ్ అధికారి కె శ్రీరామచంద్ర రెడ్డి

కి ఉత్తమ సేవా అవార్డు లభించింది. ఈ అవార్డును కలెక్టర్ మాధవిలత చేతుల మీదుగా అవార్డ్ పొందటం జరిగినది. అదేవిధంగా పెరవలి పోలీస్ స్టేషన్ లో పనిచేయుచున్న కానిస్టేబుల్ సాంబకు ఉత్తమ సేవా వద్దు లభించింది అవార్డును తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవిలత చేతుల మీదుగా అందుకున్నారు. పెరవలి మండలానికి చెందిన ముగ్గురు అధికారులకు అవార్డు రావడం పట్ల పెరవలి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది అందరూ అభినందలు తెలియజేశారు. ఈ అవార్డుకు ఎంపికైన టైపిస్ట్ కోన వెంకట వేణుకు పంచాయతీరాజ్ ఏఈ రామచంద్ర రెడ్డికి పెరవలి పోలీస్ కానిస్టేబుల్ సాంబ కు పెరవలి ఎంపీపీ కార్చెర్ల సీతారాం ప్రసాద్ ఎంపీడీవో రమేష్ జడ్పిటిసి కొమ్మిశెట్టి రామాంజని కిచ్చు పెరవలి మండల వైసిపి అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు ఎంపీడీవో ఆఫీస్ సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు మామ వియోగం

సామర్లకోట, మేజర్ న్యూస్ : సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణకి మామ వియోగం కలిగింది. పట్టణ వైఎస్ఆర్సిపి నాయకులు గంగిరెడ్డి కృష్ణమూర్తి తండ్రి గంగిరెడ్డి స్వామి నాయుడు (86) వయసు రీత్యా ఈ మధ్యకాలంలో కొంతకాలం అస్వస్థతకు గురై శనివారం ఉదయం పరమపదించారు. స్వామి నాయుడు గతంలో ఒక ప్రముఖ దినపత్రికకు ఏజెంట్గా దశాబ్దాల కాలం పాటు పనిచేశారు. ఆయన కుమారుడు గంగిరెడ్డి కృష్ణమూర్తి వైఎస్ఆర్సిపి లో ప్రముఖ నాయకునిగా ఉండగా ఆయన కోడలు అయిన అరుణ ప్రస్తుతం మున్సిపల్ చైర్ పర్సన్ గా పదవిలో కొనసాగుతున్నారు. స్వామి నాయుడు మృతితో పెద్దాపురం నియోజకవర్గ వైఎస్సీపీ ఇంచార్జీ దొరబాబు మరియు మున్సిపల్ కమిషనర్ జె రామారావు తోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్లు ఊబా జాన్ మోజెస్, గోకిన సునేత్రా దేవి, అందరూ కౌన్సిలర్లు స్వామి నాయుడు భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబానికి నివాళులర్పించారు.

ఉత్తమ అధికారిగా సేవా పురస్కారం అందుకొన్న ఆగిరిపల్లి ఈవో ప్రసాద్

ఆగిరిపల్లి,మేజర్న్యూస్: 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన ఆగిరిపల్లి గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈ వో) బొల్లినేని ప్రసాద్ పంచాయితీ కార్యాలయ పరిపాలనలో ఉత్తమ సేవలు అందించి, పంచాయతీరాజ్ విభాగం నుంచి ఉత్తమ అధికారిగా కలక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా శుక్రవారం పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ లో పురస్కారం అందుకున్నారు. ఈకార్యక్రమంలోజిల్లాఎస్పీ మేరీప్రశాంతి,జాయింట్ కలెక్టర్ లావణ్య వేణి తదితరులు పాల్గొన్నారు.

ఉన్న రోడ్లకు మరమ్మత్తులు చేయించలేని వైసీపీ ప్రభుత్వం

... జనసేన సమన్వయకర్త బివి రావు

కైకలూరు,మేజర్న్యూస్: కైకలూరు మండలం ఆచవరం గ్రామంలో జనసేన జన బేరి పాదయాత్రలి లో భాగంగా నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త సిపి బీవీరావు ఆధ్వర్యంలో పాదయాత్రను నిర్వహించారు. బివిరావుకి గ్రామస్తులు బ్రహ్మరథం పడుతూ అడుగడుగున నీరాజనాలు పట్టారు. ప్రజలు తమ తమ సమస్యలను బీవీ రావుకి విన్నవించుకున్నారు.. అర్హులైన తల్లులకు అమ్మబడి రాకపోవడం సరైన రోడ్లు లేకపోవడం, ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయించకపోవడం, ప్రధానంగా తాగునీటి డ్రైనేజీ వ్యవస్థ గ్రామంలో లేకపోవడం, అర్హులకు పింఛన్ అందకపోవడం , అర్హులైన రైతులకు రైతు భరోసా రాకపోవడం, ఆక్వా రైతులకు విద్యుత్ చార్జీల సబ్సిడీలు ఇవ్వకుండా ఆపివేయడం, చేపల చెరువులకు అధిక విద్యుత్ ఛార్జీలు వంటి పలు రకాల సమస్యలను బీవీ రావు దృష్టికి తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా బీవీ రావు మాట్లాడుతూ ఈ రోజున పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నామని, తెలియజేశారు.. జగన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారన్నారు. రానున్న రోజులలో అధికారంలో కి వచ్చేది జనసేన – టిడిపి కూటమే అని స్పష్టం చేసారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రతిష్టించడం జరిగిందని ఆ అయోధ్య రాముని సాక్షిగా ప్రజలు ఈ జగన్ రెడ్డి రాక్షస పరిపాలనను అంతమొందించడానికి సిద్ధంగా ఉన్నట్లు ముక్తకంఠంతో ఉన్నారని తెలిపారు. కైకలూరులో కూడా జనసేన జెండా ఎగరేసి తీరుతామని ఆయన భీమా వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలన్నిటిని నెరవేర్చి పవన్ – చంద్ర బాబు భవిష్యత్తు గ్యారంటీ లో ఉన్నటువంటి హామీలను అన్నిటిని నెరవేరుస్తామని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి మండల జనసేన పార్టీ గౌరవాధ్యక్షులు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ , ముదినేపల్లి జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బుసనబోయిన అశోక్ , మండవల్లి మండల జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు కోట విప్లవ వర ప్రసాద్ , బొండాడ రాఘవ, కైకలూరు యాదవ సంక్షేమ సంఘ వ్యవస్థాపక కార్యవర్గ సభ్యులు విజయకుమార్,కొల్లేరు ప్రజాసమతి నాయకులు మోరు విజయకుమార్,జనసేన తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఓడిపోతామనే ఆందోళనలో జగన్

ఏలూరు కార్పొరేషన్,మేజర్ న్యూస్:వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోతామన్న భయం సీఎం జగన్మోహన్ రెడ్డికి పట్టుకుందని, అందుకే తన బేలతనాన్ని చాటుకుంటున్నారని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ బడేటి చంటి విమర్శించారు. ఏలూరు 28వ డివిజన్ పుష్పలీలానగర్ లో శనివారం జరిగిన ప్రజా సంకల్పయాత్రలో టీడీపీ ఇంఛార్జ్ బడేటి చంటి పాల్గొన్నారు. ప్రజలకు టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ప్రజాసంక్షేమం ,మహిళాభ్యుదయం టీడీపీతోనే సాధ్యమని ప్రజలకు వివరించారు. అలాగే ప్రజా సమస్యలను తెలుసుకుని, టీడీపీ జనసేన కూటమి అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం అంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిన సైకో సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని ఆయన మండిపడ్డారు. అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్ ను ఎప్పుడు గద్దె దించాలా అని అన్ని వర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. జగన్ అసలు స్వరూపాన్ని సొంత సోదరి షర్మిల బట్టబయలు చేస్తూండడంతో సీఎంతో పాటు వైసీపీ నాయకులు కూడా హడలెత్తిపోతున్నారన్నారు. మొన్నటి వరకు జగనే మా భవిష్యత్ అంటూ మా నమ్మకం అన్న ఆ పార్టీ నాయకులు ఇప్పుడు ఆయనకు నమస్కారం పెట్టి బయటకు వెళ్ళిపోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఏలూరులో ప్రజాప్రతినిధి శంకుస్థాపనల పేరుతో హడావిడి చేస్తున్నారని, వాస్తవానికి ప్రజా సమస్యలను తీర్చే విషయంలో ఆయన ఘోరంగా విఫలమైయ్యారని ఆయన ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంఛార్జ్ రెడ్డి నాగరాజు, డివిజన్ ఇంఛార్జ్ తంగిరాల అరుణ, మాజీ కార్పొరేటర్ సరిది కృష్ణవేణి, తంగిరాల సురేష్, కలవలపూడి చంద్రశేఖర్, వీరభత్తుల రామారావు, మచ్చ ఉమా, షేక్ సైదులు, ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో పంచాయతీ కార్యదర్శి మృతి

నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ : మండలంలోని రుస్తుంబాద గ్రామానికి చెందిన యడ్లపల్లి రఘునాథరావు (59) శనివారం ఉదయం గుండెపోటుతో ఆయన నివాసంలో మృతి చెందారు. ఆకివీడు మండలం దుంప కడప పంచాయతీ కార్యదర్శి గా ఆయన పని చేస్తున్నారు. ఆయనకుభార్య, ఇద్దరు కుమారులు కలరు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బొమ్మిడి నాయకర్,గ్రామ సర్పంచ్ బందెల భారతి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంచితనానికి మరో పేరుగా, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఆపదలో ఉన్నవారికి సహాయం చేసే రఘునాథరావు మరణించడం పట్ల గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఆయన మృతదేహాన్ని చూసేందుకు వారి నివాసం దగ్గర పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అబాకస్ / వేదిక్‌మ్యాథ్‌లలో ఆదిత్య విద్యార్థులకు అంతర్జాతీయస్థాయిలో బహుమతులు

కాకినాడ,మేజర్న్యూస్ : పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, వేగం, ఖచ్చితత్వం మరియు తార్కికసామర్థ్యాలను మెరుగుపరచడానికి అబాకస్, వేదిక మ్యాథ్ స్కిల్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అటువంటి అబాకస్ మరియు వేదికా మ్యాథ్స్ ను ఆదిత్య పాఠశాలలు తమ కో–అకడమిక్ లో భాగంగా చేర్చుకుని నిష్ణాతులైన ఉపాధ్యాయుల తర్ఫీదుతో GLC (Global Level Competition) వంటి అంతర్జాతీయ పరీక్షలలో అద్భుత ఫలితాలను సాధిస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల స్మార్ట్‌జీనియస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయస్థాయి అబాకస్, వేదికా మ్యాథ్ పోటీలలో ఆదిత్య విద్యార్థులు తమ అద్భుతమైన ప్రతిభా పాటవాలను చాటారు. స్మార్ట్ జీనియస్ ఛైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి GLC 2023–24 ఫలితాలను ప్రకటిస్తూ అబాకస్ మరియు వేదిక్‌మ్యాథ్ విభాగాలలో పరీక్షకు హాజరైన 19,000 మందిలో 1,350 మంది విజయం సాధించగా వారిలో 529 మంది అనగా 40% విద్యార్థులు ఆదిత్యకు చెందిన వారేనని తెలియజేశారు. వీరంతా ఫిబ్రవరి 25వ తేదీన హైదరాబాద్ రవీంద్రభారతిలో జరుగబోయే బహుమతి ప్రధానోత్సవంలో ముఖ్యఅతిథుల చేతులమీదుగా బహుమతులు అందుకోనున్నారు.

స్మార్ట్ జీనియస్ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన అంతర్జాతీయస్థాయి అబాకస్, వేదిక్‌మ్యాథ్ పోటీలలో 1,350 మంది విజయం సాధించగా వారిలో 529 మంది అనగా 40% విద్యార్థులు ఆదిత్య పాఠశాలలకి చెందినవారే కావడంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి విజేతలకు అభినందనలందజేసారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్.శృతిరెడ్డి మరియు వెస్ట్ గోదావరి డైరెక్టర్ ఎస్.వి.రాఘవరెడ్డి విద్యార్థులను విజేతలుగా తీర్చిదిద్దిన ప్రిన్సిపాల్స్ మరియు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

పోస్ట్ ట్రేండింగ్‌లో జనసేన

– జనసేన వైపు జనం చూపు
– అర్బన్, మునిసిపాలిటీ, ఏజెన్సీ అనే తేడా లేకుండా చేరికలు
– జనసేన మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : జనసేన పార్టీవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రజల చూపు పడిందని పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా పవన్ కళ్యాణ్ వైపు మొగ్గుచూ పుతున్నారని, ఇది శుభపరిణామమని వరరామచంద్రాపురం, జనసేనపార్టీ అధ్యక్షులు, ములకాల సాయి కృష్ణ స్పష్టంచేశారు. శనివారం ఆయన తనస్వగృహంలో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆశక్తికర విషయాలు మాట్లాడారు.ఎవరు,ఎన్నీ, కుయు క్తులుపన్నినా పొత్తుధర్మాన్ని తూఛా తప్పకుండా పాటిస్తామని స్పష్టంచేశారు. 2024 ఎన్నికల్లో పోరు రసవత్తరంగా ఉంటుందని ఆయనఅన్నారు. ఈ రసవత్తరమైన పోరులో కొనెదల పవన్ కళ్యాణ్,మార్కు రాజకీయాలు తెరపైకి వస్తాయని, అందరికీ మంచే జరుగుతుందని నిరుద్యోగులకు, పెద్దపీటవేస్తారని, నిత్యావసర సరుకుల ధరల్లో వ్యత్యాసం చూపిస్తామని అదే కొనెదల పవన్ కళ్యాణ్ మార్క్ రాజకీయాలని ఆయన అన్నారు. ఊర్లకు ఊర్లే జనసేన పార్టీలో చేరుతున్నారని, ఇది ఒక్క జనసేన పార్టీకే సాధ్యమైందని ఆయన గుర్తుచేశారు. నిజాయితీ, అవినీతి రహిత, పేదల నిర్మూలన, నిరుద్యోగులకు, ఉద్యోగ అవకాశాలు,పవన్ కళ్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారని,ఆయన తెలిపారు. ప్రజలకు ఏం కావాలో పవన్ కళ్యాణ్‌కు తెలుసన్నారు. ఓటు అనేఆయుధ ం మీచేతుల్లోఉంది,సమయం వచ్చినప్పుడు గట్టిగా కొట్టాలని కోరారు. రాబోవు ప్రభుత్వంలో కొనెదల పవన్ కళ్యాణ్, కీలకపాత్ర పోషించడం తధ్యమని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలు, పవన్అభిమానులు, మహిళలు తదితరులు హాజరయ్యారు.

అధైర్యపడకండి అండగా ఉంటాం..

– సి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : అధైర్య పడకండి అండగా ఉంటామని సి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు,అన్నారు.శనివారం వరరామచంద్రాపురం,మండల పరిధిలోని,రేఖపల్లి పంచాయతీ లోని రేఖపల్లి గ్రామంలో చింతకాయల వెంకటేశ్వర్లు, (భార్య) సరస్వతి,గారి కూతురు అనూష,ప్రమాద వశాత్తు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. అనూష ను మండల సి.పి.ఎం.పార్టీ మండల కమిటీనాయకులు, జిల్లాకమిటీ సభ్యులు,కలిసిపరామర్శించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కా సోయం చిన్నబాబు,మాట్లాడుతూ మీకు మీకుటుంబానికి సి.పి.ఎం.పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. త్వరగా కోలుకోవాలని వారు కోరారు.ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. మీకోసంమేమున్నాం అంటూ భరోసాఇచ్చారు. పరామర్శించిన వారిలో జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, లక్ష్మణరావు, ప్రకాష్ రావు, సిహెచ్ సుబ్బారావు, కమ్మచిచ్చు సత్తిబాబు,తదితరులు పరామర్శించారు.

ఘనంగా ఎలక్షిషన్ డే కార్యక్రమం

పెరవలి, మేజర్ న్యూస్ : పెరవలి మండలం ప్రైవేట్ ఎలక్ట్రిషన్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెరవలి ముక్కామల గ్రామాల్లో జనవరి 27వ తేదీ శనివారం ఎలక్ట్రిషన్ డే కార్యక్రమము ఘనంగా నిర్వహించారు. గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ యూనియన్ ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ముక్కామల గ్రామపంచాయతీ పరిధిలో ఉమ్మడివారిపాలెం ఏటిగట్టు సమీపంలో సమీక్ష సమావేశం నిర్వహించి దాతగీత ఎంటర్ప్రైజెస్ వారి సహకారంతో సమపక్తి భోజన ఏర్పాట్లు చేశారు. అనంతరం యూనియన్ ప్రెసిడెంట్ పి .ధనరాజ్ మాట్లాడుతూ థామస్ అల్వా ఏడిసన్ బల్బ్ కనుగొన్న జనవరి 27 తేదీన ఎలక్ట్రిషన్ డే జరుపుకోవడం అనవాయితీగా జరుగుతుందని ప్రభుత్వం ఎలక్ట్రిషన్ డే ను గుర్తించాలన్నారు. ఎంతో ప్రమాదకరమైన వృత్తిలో ఉన్న వర్కర్స్ ను ఆదుకుని ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు ఈ.ఎస్.ఐ ప్రత్యేక వృద్ధాప్య పెన్షన్ లు, ఇళ్ల స్థలాలు, ఇచ్చి గ్రామీణ శ్రామిక వర్గ ఎలక్ట్రిషన్లను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పి.వెంకటేశ్వర్లు, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లు, ప్లంబింగ్ వర్కర్స్, పాల్గొన్నారు.

పాలకొల్లును గెలిపించి
జగన్‌కు బహుమానంగా ఇద్దాం

వైసిపి ఇన్చార్జ్ గోపి

పాలకొల్లు,మేజర్న్యూస్:స్థానిక వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో వైస్సార్ సేవాదళ్ మండల పట్టణ స్థాయిలో సమావేశం శనివారం నిర్వహించారు, పాలకొల్లు నియోజకవర్గ వైసీపీ పార్టీ ఇన్చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలకొల్లు టికెట్టు తనకు ఇచ్చినందుకు కష్టపడి పనిచేసి గెలుపుకు ప్రతి ఒక్క నాయకులూ కార్యకర్తలు సమిష్టిగా పనిచేసే పాలకొల్లు ఎమ్మెల్యే వైసిపి కైవసం చేసుకుని గిఫ్ట్ గా జగన్మోహన్ రెడ్డికిఇద్దామని అన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ వచ్చే 2024 ఎన్నికలలో గుడాల శ్రీహరి గోపాలరావుని పాలకొల్లు నియోజకవర్గం నుంచి గెలిపించుకొని పాలకొల్లు వైఎస్ఆర్సిపి జెండా ఎగరవేస్తామని వైఎస్ఆర్సిపి నాయకులు అందరూ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబెర్ చెల్లె%శీ% ఆనంద్ ప్రకాష్ వైయస్సార్ సేవాదళ్ రీజినల్ కోఆర్డినేటర్ చినిమిల్లి వెంకటరాయుడు , వైసీపీ సీనియర్ నాయకులు గుణ్ణం నాగబాబు , మాజీ డీసీఎంస్ చైర్మన్ యడ్ల తాతాజీ , పాలకొల్లు పట్టణ అధ్యక్షులు చందాక సత్తిబాబు , జడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు ,జిల్లా సేవాదళ్ ప్రెసిడెంట్ యేసు , జిల్లా సేవాదళ్ సెక్రెటరీ బొడ్డు సుబ్బారావు (బాబి) యలమంచిలి మండలం సేవాదళ్ కన్వీనర్ ఏ.చిన్న బాబు , పాలకొల్లు మండలం సేవాదళ్ కన్వీనర్ కృష్ణ , పాలకొల్లు సేవాదళ్ కన్వీనర్ జానకిరామ్ , పోడూరు మండలం సేవాదళ్ కన్వీనర్ బీర రాజశేఖర్ ,వైసీపీ సీనియర్ నాయకులు ముచర్ల శ్రీ రామ్ , రాష్ట్ర యూత్ నాయకులు ఉచ్చుల స్టాలిన్ బాబు , రాష్ట్ర మహిళా సెక్రెటరీ మద్దా చంద్రకళ రాష్ట్ర మహిళా జాయింట్ సెక్రెటరీ కర్రా జయ సరిత , పోడూరు మండలం కన్వీనర్ పితాని సత్యనారాయణ , పాలకొల్లు మండలం కన్వీనర్ విపర్తి ప్రభాకర్ , మాజీ మండల కన్వీనర్ మైలబత్తుల మైఖిల్ రాజు , జే సి ఎస్ కన్వీనర్ పార్సి వెంకటరత్నం , సేవాదళ్ నాయకులు సోషల్ మీడియా కన్వీనర్లు పాలకొల్లు పట్టణం వార్డ్ ఇన్చార్జులు పాలకొల్లు నియోజకవర్గం సర్పంచులు గ్రామ అధ్యక్షులు ఎంపీటీసీలు దేవస్థానం చైర్మన్లు మొదలగు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక ఆరోగ్య కేంద్ర భవనం ప్రారంభం

పెనుగొండ, మేజర్ న్యూస్:పెనుగొండ మండలం పెనుగొండ శివారు చెరుకువాడ గ్రామంలో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం మాజీ మంత్రి, వైసిపి జిల్లా పార్టీ అధ్యక్షులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ప్రారంభించారు. రూ.2.03 కోట్లు నిధులతో ఈ భవనాన్ని ఇటీవల నిర్మించారు. శనివారం ఆసుపత్రి ప్రాంగణంలోని ఓపి విభాగంతో పాటు అత్యవసర విభాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై జనసేన పోరుబాట పాదయాత్ర

ఏలూరులో జోరు పెంచిన జనసేన

ఏలూరు,మేజర్న్యూస్: ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి రెడ్డి అప్పలనాయుడు మండిపడ్డారు.. 31 వ డివిజన్ అశోక్ నగర్ లో పత్తేబాద ప్రేమ్ కుమార్,వట్టి సుధాకర్, మోహన్ రావు ఆధ్వర్యంలో ఆయన శనివారం పర్యటించి, అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన కరపత్రాలను వారికి అందించి జనసేన తెలుగుదేశం పార్టీల ఉమ్మడి ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకతను వాళ్లకు వివరించారు..

ఈ సందర్భంగా రెడ్డి అప్పల నాయుడు మాట్లాడుతూ ఏలూరు నగరంలో ఎన్నో రకాల సమస్యలు ఉన్నాయని, ఏదో ఒక సాకులు చెప్పి పెన్షన్లు కట్ చేసే పరిస్థితిని కల్పించారని వైసీపీ ప్రభుత్వం కల్పించారని, ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు సైతం నిలిపి వేస్తున్నారని మండిపడ్డారు..ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, ఈ డివిజన్లో ఉన్న కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ప్రజలు వారి యొక్క సమస్యలను మాకు వివరిస్తుంటే చాలా బాధగా ఉందని ఈ ప్రభుత్వాన్ని అంతమొందించడానికి ప్రజలంతా సంసిద్ధంతో ఉన్నారని ధ్వజమెత్తారు.. ఈ ప్రాంతంలో చిన్న తుఫాను వస్తేనే మునిగిపోయే పరిస్థితి ఏర్పడిందని, డ్రైనేజీ సమస్యలు కూడా అధికంగా ఉన్నాయని ఈ విషయాన్ని ప్రజలు మా దృష్టికి తీసుకు వచ్చారని అన్నారు.. పవన్ కళ్యాణ్ గారి ఆదేశాల మేరకు రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని జనసేన తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు..

మంచి సుభిక్షమైన పరిపాలన అందించే దిశగా మేము ప్రయాణం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము.. అలాగే స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇప్పటికైనా మొద్దు నిద్ర లేవాలని ఇంకా మిగిలిన ఈ మూడు నెలల కాలంలో ప్రజలు పడుతున్న కష్టాలను తీర్చాల్సింది పోయి ఏదో హడావిడిగా ప్రతి డివిజన్ కెళ్ళి శంకుస్థాపన చేసి పబ్బం గడుపుకోవడం కాదని ఈవిధంగా జనసేన పార్టీ నుండి హెచ్చరించారు..

మారుమూల ప్రాంతాల్లో నైనా ఏ సమస్యా ఉన్నప్పటికీ క్షణాల్లో ఆ సమస్యకు జనసేన పార్టీ తరపున పరిష్కారం చూపుతామని,నాలుగున్నర సంవత్సరాలు గడుస్తున్నా వాటిని పరిష్కరించలేని స్థితిలో అధికారులు అధికార ప్రతినిధులు ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశినరేష్, లీగల్ సెల్ అధ్యక్షులు నిమ్మల జ్యోతి కుమార్,ఉప